# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 162 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

29-04-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4








# అసిరితల్లి భక్తి తరంగం

## అరసవల్లిలో భక్తి శ్రద్ధల నడుమ

## సిరిమాను మహోత్సవం

అరసవల్లి ప్రాంత ప్రజల ఆరాధ్య దైవంగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ అసిరితల్లి గ్రామదేవత అమ్మవారి సిరిమాను ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన వీధులన్నీ జనసంద్రంగా మారగా గ్రామమంతా భక్తి పరవశంతో కళకళలాడింది.



**నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం**

అసిరితల్లి గ్రామదేవత అమ్మవారి సిరిమాను ఉత్సవం సందర్భంగా ఉదయం వేళ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణలు నిర్వహించారు. పూలతో, పండ్లతో, రంగురంగుల వస్త్రాలతో అలంకరించిన అమ్మవారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణం ఉదయం నుంచే భక్తులతో నిండిపోయింది. అనంతరం సంప్రదాయబద్ధంగా సిద్ధం చేసిన సిరిమానును ఘనంగా ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, జై అసిరితల్లి నినాదాల మధ్య సిరిమాను ప్రధాన వీధుల గుండా సంచరించగా భక్తులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మహిళలు పసుపు, కుంకుమలతో హారతులు సమర్పించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. ఇళ్ల పైకప్పులు, బాల్కనీలు, వీధుల వెంట ప్రజలు నిలబడి సిరిమాను దర్శించుకున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై పండుగను ఆస్వాదించారు. గ్రామ వీధులన్నీ జైజైధ్వానాలతో మారుమోగాయి. సిరిమాను దర్శనం చేసుకుంటే కుటుంబాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. దీంతో సమీప గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయం వద్ద క్యూలైన్లు పొడవుగా కనిపించాయి. ఉత్సవంలో భాగంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

భక్తులకు తాగునీరు, ప్రసాదం, విశ్రాంతి సదుపాయాలు కల్పించారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని భక్తులకు సహాయ సహకారాలు అందించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ వీధులన్నీ విద్యుత్ దీపాలు, తోరణాలు, పూల అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రతి వీధి పండుగ వాతావరణంతో కళకళలాడింది.

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన వేలాది మంది భక్తులు
- ప్రధాన వీధుల గుండా ఘనంగా సాగిన సిరిమాను ఊరేగింపు
- ప్రత్యేక పూజలు, మంగళహారతులతో ఆలయం కిటకిటలాడింది
- మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు
- అన్నదానంతో సేవా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి
- పోలీసుల పహారా మధ్య శాంతియుతంగా ఉత్సవ నిర్వహణ
- గ్రామమంతా పండుగ శోభతో కళకళలాడింది
- అమ్మవారి కటాక్షం కోరిన భక్తజనం
- అంగరంగ వైభవంగా ముగిసిన అసిరితల్లి ఉత్సవం

సాయంత్రం వేళ సిరిమాను మరింత వైభవంగా దర్శనమిచ్చింది.

భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ అసిరితల్లి అమ్మవారి కటాక్షంతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం నెలకొనాలని కోరుకున్నారు. ప్రతి 10 యేళ్లకు ఇదే విధంగా ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం వేళ సిరిమాను తిరిగి ఆలయానికి చేరుకోగా భక్తులు చివరిసారిగా దర్శించుకుని హారతులు సమర్పించారు. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన అసిరితల్లి సిరిమాను ఉత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది.

ఎడిటోరియల్

# కొత్త దాడి!

ప్రపంచ రాజకీయ వేదికపై అమెరికా మరోసారి తన అసలు స్వరూపాన్ని స్పష్టంగా బయటపెట్టింది. అరవై ఆరు అంతర్జాతీయ సంస్థలనుంచి, ఒప్పందాల నుంచి వైదొలుగుతున్నట్టు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా ఐరాస ఆధ్వర్యంలోని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పిఎ) నుంచి తప్పుకోవడం, వాతావరణ మార్పులపై అంతర్జాతీయ ఒప్పంద వ్యవస్థను పక్కనబెట్టడం వంటి నిర్ణయాలు కేవలం పాలనాపరమైన చర్యలు కావు. అమెరికా సామ్రాజ్యవాద రాజకీయాలు ఎదుర్కొంటున్న లోతైన సంక్షోభానికి సంకేతాలు. చాలామంది చెబుతున్నట్టు ఇది "వెనుకడుగు" కాదు, "కొత్త దాడి."
సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ఉపయోగించే సాధనాలను మార్చుకుంటున్న దశ ఇది. అంతర్జాతీయ సంస్థలు ఇక పూర్తిగా తమ ప్రయోజనాలకు సేవ చేయడం లేదని భావించినప్పుడు, వాటిని పక్కనబెట్టి నేరుగా శక్తి, మార్కెట్, సైనిక బలంపై ఆధారపడటమే ఈ వ్యూహం. అంటే నియమాల రాజకీయానికి బదులుగా బల రాజకీయానికి మారడం.
నిజానికి ఐక్యరాజ్యసమితేమీ ప్రపంచ ప్రజల స్వతంత్ర సంకల్పానికి ప్రతిరూపం కాదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, సామ్రాజ్యవాద శక్తుల మధ్య జరిగిన రాజకీయ రాజీ ఫలితమది. భద్రతా మండలిలోని శాశ్వత సభ్యత్వం, వీటో అధికారం.. ఇవన్నీ ఐక్యరాజ్య సమితిని సమానదేశాల సమాఖ్యగా కాకుండా, బలమైన దేశాల ఆధిపత్య వ్యవస్థగానే చూపిస్తాయి. అయినప్పటికీ వలస విముక్తి ఉద్యమాలు, నాటి బలమైన సోషలిస్టు శిబిరం, మూడో ప్రపంచ దేశాల పోరాటాల వల్ల మానవ హక్కులు, ఆరోగ్యం, మహిళల హక్కులు, వాతావరణ పరిరక్షణ వంటి అంశాల్లో కొంత ప్రజాపక్ష పాత్ర అది పోషించాల్సి వచ్చింది. ఇదే ఇప్పుడు అమెరికాకు అసౌకర్యంగా మారింది. అమెరికా ఇప్పటికీ అతి పెద్ద సైనిక శక్తి, ప్రధాన ఆర్థిక శక్తులలో ఒకటి. అయినా అంతర్జాతీయ సంస్థల నుంచి వెనక్కి తగ్గుతోంది. కారణం స్పష్టం. ఒకప్పుడు అమెరికా చెప్పిందే అంతర్జాతీయ నిర్ణయం. ఇప్పుడు ప్రపంచ రాజకీయ సమతుల్యత మారుతోంది. చైనా, రష్యా వంటి శక్తులు ఎదుగుతున్నాయి. మూడో ప్రపంచ దేశాలూ స్వతంత్ర స్వరం వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా ముందు రెండు మార్గాలే ఉన్నాయి. నియమాలను అంగీకరించడం లేదా తిరస్కరించడం. అమెరికా రెండో మార్గాన్ని ఎంచుకుంది. ఇది ట్రంప్ వ్యక్తిగత మొండితనం కాదు. సామ్రాజ్యవాద రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న నిర్మాణాత్మక మార్పు.
రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా తన ఆధిపత్యాన్ని సైనిక చర్యలకంటే ఈ అంతర్జాతీయ సంస్థలు, ఒప్పందాల ద్వారానే నిర్మించింది. కానీ ఇప్పుడు ఆ వ్యవస్థలే అమెరికాకు బంధనాలుగా మారాయి. అందుకే వాటిని తెంచుకోవటం, చింపేయడం... ఇదే కొత్త వ్యూహం.అంతర్జాతీయ సంస్థల నుంచి అమెరికా వైదొలగడం అంటే ప్రపంచ సమస్యల పరిష్కారం నుంచి తప్పుకోవడం మాత్రమే కాదు, వాటిని ఏకపక్షంగా, కార్పొరేట్ ప్రయోజ నాలకు అనుకూలంగా మలచుకో వాలన్న బరితెగింపుకు పూనుకోవడం.
వాతావరణ ఒప్పందాల తిరస్కరణ అంటే ప్రకృతిని మరింత నిర్దాక్షిణ్యంగా దోచుకునే స్వేచ్ఛను కోరుకోవడం. యూఎన్ఎఫ్‌పిఎ నుంచి బయటపడటం అంటే మహిళల, పిల్లల, పేద దేశాల ఆరోగ్య హక్కులనుపెట్టుబడికి తాకట్టు పెట్టడం. ఇంతకాలం అమెరికా "మానవ హక్కులు", "ప్రజాస్వామ్యం", "అంతర్జాతీయ నియమాలు" అనే నైతిక తెరవెనుక తన అసలు ముఖాన్ని దాచుకుంది. ఇప్పుడు ఆ తెర కూడా అవసరం లేదన్న భావన కనిపిస్తోంది. ఇది ఆత్మవిశ్వాసం కాదు. సంక్షోభంలో పడిన శక్తి లక్షణం. డిప్లమసీ స్థానంలో దబాయింపు, సహకారం స్థానంలో బెదిరింపు.. అంటే నియమాల స్థానంలో బలమే చివరిభాషగా మారుతోంది. దీని ప్రభావం ప్రపంచమంతా పడుతుంది. "అంతర్జాతీయ బాధ్యతలు అవసరం లేదు, దేశ ప్రయోజనాల పేరుతో ఏదైనా చేయొచ్చు" అన్న సందేశం మితవాద, జాతీయవాద శక్తులకు ప్రోత్సాహం ఇస్తుంది. వాతావరణ సంక్షోభం, శరణార్థుల సమస్య, మహమ్మారుల వంటి సరి హద్దులు లేని సమస్యలకు ఏకపక్ష పరిష్కారాలు సాధ్యం కావు. అయినా కూడా అమెరికా అదే దిశలో నడుస్తోంది. అయితే, అమెరికా వెనక్కి తగ్గినచోట చైనా, రష్యా వంటి శక్తులు ఆ ఖాళీని నింపే ప్రయత్నం చేస్తాయా? అన్నది ప్రస్తుతానికి ప్రశ్నగానే మిగిలి ఉంటుంది. కాకపోతే ఒక విషయం మాత్రం స్పష్టం... ప్రపంచం ఇక ఒకేశక్తి ఆదేశాలతో నడిచే దశను దాటిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజాపక్ష అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలా? లేక కొత్త ఆధిపత్యాలకు తలవంచాలా? అన్న రాజకీయ ఎంపిక మూడో ప్రపంచ దేశాల ముందున్నది. ఐక్యరాజ్య సమితి సంపూర్ణ ప్రజాస్వామ్య సంస్థ కాకపోయినా, ఇప్పుడు దాన్ని వదిలేయడం సామ్రాజ్య వాదానికే లాభం. దాన్ని మరింత ప్రజాపక్షంగా మార్చేందుకు పోరాడటమే ఇప్పుడు ప్రపంచం ముందున్న లక్ష్యం. మొత్తంగా ఈ పరిణామంలో గుర్తించాల్సిన సత్యమేమి టంటే.. ఇది "అమెరికా వెనుకడుగు" కథ కాదు. ఇది సంక్షోభంలో ఉన్న సామ్రాజ్యవాదం ముసుగు తొలగించుకుని ముందుకు వస్తున్న కథ. ఈ మార్పును కేవలం ట్రంప్ వ్యక్తిత్వానికి కట్టబెట్టడమంటే అసలు ప్రమాదాన్ని గుర్తించకపోవడమే. అంతిమంగా ఈ 'కొత్త దాడి' వ్యూహానికి ప్రపంచ ప్రజలు ఎలా ప్రతిస్పందిస్తారు? ఐక్యతను బలోపేతం చేస్తారా? లేక బలమైనవారి ముందు తలవంచుతారా? ఈ ఎంపికలే ప్రపంచ రాజకీయ దిశను నిర్ణయిస్తాయి.

# ఏబీఎన్ రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీకి వైయస్సార్సీపి శ్రేణుల ఫిర్యాదు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో వినతి



**నవతరం-శ్రీకాకుళం**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర నాయకుల కుటుంబ సభ్యులపై ఆంధ్రజ్యోతి ఎడిటర్ ఇన్ చీఫ్ వేమూరి రాధాకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని పార్టీ ముఖ్య నాయకులు మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు, పార్టీ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ లతో ఆయన కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణపై చర్యలు కోరుతూ ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీన రాధాకృష్ణపై, సదరు కథనాలను ప్రచారం చేసిన వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో వ్యక్తుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. మహిళలను, కుటుంబ సభ్యులను కించపరిచేలా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీని కోరారు.

**పాత ఫిర్యాదుల ప్రతులతో వినతి..**

గతంలో పోలీస్ స్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదు కాపీలు, రసీదులు, రిజిస్టర్ పోస్ట్ ట్రాకింగ్ వివరాలను కూడా ఫిర్యాదుతో పాటు ఎస్పీకి జతచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు మామిడి శ్రీకాంత్, బొడ్డేపల్లి రమేష్, గేదెల పురుషోత్తం, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్పీ మహేశ్వర రెడ్డి.. దీనిపై చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలి

- రాజకీయాల్లో తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి
- ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి
- దళితవాడల్లో స్మశానవాటికలు ఏర్పాటు చేయాలి
- దళిత ఆదివాసి జేఏసీ నాయకుల డిమాండ్
- నూతన కార్యవర్గం ఏర్పాటు



**నవతరం శ్రీకాకుళం**

శ్రీకాకుళంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును నామకరణం చేయాలని దళిత ఆదివాసి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.
ఎన్నో ఏళ్లుగా వెనుకబడి తనానికి గురవుతున్న ఎస్సీ ఎస్టీలకు రాజ్యాధికారం సాధించే దిశగా అవకాశాలు పెరగాలని దళిత ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజాసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు పూతల దుర్గారావు అన్నారు.
నగరంలోని ఇలిసిపురం జంక్షన్ లో ఉన్న అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో మంగళవారం దళిత ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జేఏసీ అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పోతల దుర్గారావు మాట్లాడుతూ దళితులకు చట్టసభల్లో అవకాశాలు పెరగాలని కోరారు. ఆదివాసి దళితులకు విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జిల్లా పరిషత్, కార్పొరేషన్ చైర్మన్లుగా దళిత ఆదివాసీలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ గ్రామాలకు ఇప్పటికీ స్మశానవాటికలు లేదని, తక్షణమే స్మశాన వాటిక ఏర్పాటుతో పాటు రహదారి సౌకర్యాలు కల్పించాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పలు కార్పొరేషన్ల ద్వారా రుణాలను మంజూరు చేసి తక్షణమే దళిత ఆదివాసి యువత ఆర్థిక సోలం మనకు చేయూతనివ్వాలన్నారు. ప్రస్తుతం గురుకులాల్లో ఇంటర్మీడియట్ విద్య వరకు అవకాశం ఉందని వారిని డిగ్రీ , ఉన్నత విద్యకు కూడా అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్కు అంబేద్కర్ పేరు పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ బ్లాక్ లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత కుటుంబాల ప్రతి ఇంటికి వెళ్లి అంబేద్కర్ చిత్రపటాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జేఏసీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా దళిత, గిరిజనుల సమస్యలపై విస్తృతమైన చర్చ నిర్వహించేందుకు త్వరలోనే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత ఆదివాసి జేఏసీ నాయకులు కన్వీనర్ దండాసి రాంబాబు, కో కన్వీనర్ రమేష్ బాబు, గౌరవ సలహాదారు లింగాల అప్పన్న, సమన్వయకర్తలు అర్జీ కోటి, కింజరాపు నూకరాజు, అంపోలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఇదే**

దళిత ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షులు గంజి ఎజ్రా, గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు, సహాధ్యక్షులు భూపతి రవికుమార్, బసవల చిన్నారావు, దూళి మోహన్ రావు, ఉపాధ్యక్షులు నేతల ఆదినారాయణ, కన్వీనర్ దండాసి రాంబాబు, కో కన్వీనర్ సీర రమేష్ బాబు, గౌరవ సలహాదారులు నూతలపాటి భరత్ భూషణ్ రాజ్, కొప్పల డేవిడ్, లింగాల అప్పన్న, సమన్వయకర్తలు అంపోలు ప్రతాప్, అర్జీ కోటి, లింగాల నూకరాజు, ట్రెజరర్స్ ఆవల అప్పన్న, బొంతరాజు, న్యాయ సలహాదారులు కొండాల జీవరత్నం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు చల్లా రామారావు దువాన అప్పలసూరి, మీడియా కన్వీనర్స్ పడాల ప్రతాప్ కుమార్, కార్యదర్శిలు నిడగంట్ల సూర్యారావు, పాండ్రంకి తారక్, బెవర వెంకట శివ కుమార్, బొత్స శశిభూషణరావు, ధర్మాన గణేష్ తో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

# చంద్రబాబు విజన్.. లోకేష్ స్పీడ్

- ఆంధ్రాకు మహర్దశ: పీఎంజే బాబు
- ఓదిపాడులో టీడీపీ జెండా ఆవిష్కరణ
- గ్రామ సమస్యలపై నాయకులతో చర్చ



**నవతరం శ్రీకాకుళం**

టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు నర్సన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం ఓదిపాడు గ్రామాన్ని టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ అధికార ప్రతినిధి పి.ఎం.జె. బాబు సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామ సమస్యలు, పార్టీ బలోపేతంపై చర్చించారు.
గ్రామస్తులు ఉపాధి హామీ పథకంలో వేలిముద్రలు, ఐరిష్ నమోదు కాకపోవడంతో కొందరు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. బ్రిడ్జి మరమ్మతులు, తాగునీటి బావికి మార్గం కల్పించాలని కోరారు. గవరంపేటలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బాబు హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. విశాఖలో గూగుల్ సెంటర్ శంకుస్థాపనతో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా పెట్టుకున్న 20 లక్షల ఉద్యోగాల దిశగా ఉత్తరాంధ్ర పరిశ్రమలు, ఐటీ హబ్‌గా ఎదుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భైరి భాస్కరరావు, మండల అధ్యక్షుడు వెంకటప్పలనాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మే 1న మేడే జయప్రదం చేయాలి

- జిల్లా వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు
- హక్కుల కోసం ఐక్య పోరాటం
- సీఐటీయూ నేతల పిలుపు

**నవతరం శ్రీకాకుళం**

మే 1న కార్మికవర్గ దీక్షాదినమైన మేడేను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాలు, పరిశ్రమల వద్ద ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు పిలుపునిచ్చారు.
మంగళవారం శ్రీకాకుళంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృత సమావేశంలో "మేడే విప్లవ సంప్రదాయాలు" పుస్తకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల కేంద్రాలు, పరిశ్రమలు, కార్మిక కేంద్రాల్లో జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మేడేను స్ఫూర్తివంతంగా నిర్వహించాలని కోరారు.
కార్మికుల పోరాటాలతో సాధించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, 44 కార్మిక చట్టాల స్థానంలో 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తీసుకొచ్చాయని విమర్శించారు. 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిదినం అమలు చేయాలని చూస్తున్నారని అన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం గత 15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.
సమావేశంలో జిల్లా నాయకులు కె. నాగమణి, అల్లు సత్యన్నారాయణ, ఎన్. గణపతి, ఎం. ఆదినారాయణమూర్తి, ఎన్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

# మనో ఉల్లాసానికి బీచుల సందర్శన



ఒడరేవు బీచ్: చీరాలకు 7 కి.మీ.ల దూరంలో సహజసిద్ధంగా పరచిన ఇసుక తివాచీలా ఉండే ఒడరేవు బీచ్ చుట్టుపక్కల వాళ్లకేకాక ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులకు కూడా కనువిందు చేస్తుంది. స్థానిక జాలర్లు వలల అల్లుకొని, పడవలకు మరమ్మత్తులు చేయటానికి. ఈ బీచ్ను వాడుకోవటం వల్ల వారి కార్యకలాపాలు పర్యాటకులకు ఆసక్తికరంగా ఉంటాయి. చుట్టూ ఉన్న చదరమైన స్థలం తాటి, సరుగుడు వనాల ఏర్పాటుకు అనువుగా ఉండి చీరెలకు, బట్టలకు, చేపలకోసం, చీరలకు వచ్చే వ్యాపారులు, ఇతర ప్రాంత పర్యాటకులు ఈ బీచ్ని తప్పనిసరిగా చూస్తారు. ఐటిసీ వసతి గృహంతోపాటు, ఛీప్-ఎన్- డేల్ రిజార్ట్, లాహిరి రిజార్టు పర్యాటకులకు వసతి, సదుపాయాలు, ఆహార-పానీయాలను అందిస్తున్నాయి. సమీపంలోని రామాపురం ప్రాంతాన్ని రిజార్టు డెవలప్మెంట్కు చక్కగావినియోగించుకోవచ్చుఇప్పటికే ప్రజాదరణ పొందిన ఒడరేవు బీచ్ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దటానికి చర్యలు తీసుకుంటున్నారు.

మోటుపల్లి బీచ్: ప్రకాశం జిల్లాలో ఒంగోలుకు 45 కి. మీ., చిన్న గంజాంకు 12 కి.మీ.ల దూరంలో నున్న మోటుపల్లి బీచ్కు అటూ ఇటూ కొన్ని కిలోమీటర్ల పొడవున సరుగుడు తోపులుండటం చేత ఆ పచ్చదనం, నీలిరంగు ఆకాశం, బంగారు ఛాయ ఇసుక, తెల్లని నురగలు గక్కుతూ హోరెత్తించే అలలూ, పర్యాటకులను పరవశింపజేస్తాయి. కనీస వసతి సదుపాయాలతో దీన్ని ఓ పిక్నిక్ స్పాట్గా మార్చొచ్చు. చోళ, కాకతీయ, రెడ్డి, విజయనగర, కుతుబ్షాహీల కాలంలో మోటుపల్లి ఒడరేవు స్వదేశీ, విదేశీ వర్తక వ్యాపారులకు ఆటపట్టుగా ఉండేది. కాకతీయ రుద్రమదేవి కాలంలో మార్కోపోలో అనే ఇటలీ దేశపు పర్యాటకుడు మోటుపల్లి ఒడరేవును సందర్శించిన విషయాన్ని మనం మరచిపోకూడదు.

కొత్తపట్నం బీచ్: ఒంగోలుకు 18 కి.మీ.ల దూరంలో ఉన్న కొత్తపట్నం ఒంగోలు పట్టణ ప్రజలకు అతి దగ్గరలోని బీచ్, ఇప్పుడున్న ప్రభుత్వ గెస్ట్ హౌస్తో పాటు మరిన్ని వసతి సదుపాయాలను కల్పిస్తే ఇదొక మంచి బీచ్ ఏరియాగా తయారవుతుంది.

కరేడు బీచ్: ఒంగోలుకు 40 కి. మీ.లు జాతీయ రహదారికి 5 కి.మీ. దూరంలో నున్న కరేడు బీచ్ స్థానికులకు మాత్రమే ఆటవిడుపుగా ఉంది. చక్కని పరిసరాలు, విశాలమైన బీచ్ ఏరియా ఉన్న కరేడు ప్రజాదరణ పొందటానికి ప్రభుత్వ కొన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుంది. బీచ్ను శుభ్రం చేసి, జాతీయ రహదారిపై ఒక బోర్డును ఏర్పాటు చేయాలి. ఇంకా పర్యాటకుల కోసం కొద్ది పాటి వసతి, ఆహార పానీయాలను అందుబాటులోకి తెస్తే దీన్ని ఉన్నంతలో చక్కగా తీర్చిదిదొచ్చు. స్థానికంగా ఉన్న వసతి గృహాన్ని బాగుచేసి, కర్రలవంతెన్ని ఆకర్షణీయంగా చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే వీలుంది. స్థానిక స్వయం ఉపాధి గ్రూపులు కొద్దిపాటి పెట్టుబడితో ఈ బీచ మెరుగుపరచటానికి ముందుకు రావాల్సిన అవసరముంది.

రామాయపట్నం బీచ్: ప్రకాశం జిల్లా ఉలవపాడు మండల పరిధిలో నున్న ఈ బీచ్ ఒంగోలుకు 65 కి.మీ.ల దూరంలో ఉండటం చేత ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించే వీలుంది. కొద్దిపాటి నిధులతో స్థానిక ఇరిగేషన్ గెస్ట్ హౌస్ను మెరుగుపరచటం, బీచ్ను శుభ్రం చేయటం, పిల్లలకు ఓ చిన్న పార్కును ఏర్పాటు చేయడం, పర్యాటకులు కూర్చోటానికి బెంచీలను ఏర్పాటు చేయటంతోపాటు మంచినీటి సౌకర్యాన్ని, చిన్న రెస్టారెంట్ను అందుబాటులోకి తెస్తే రామాయపట్నం ఓ మంచి చిన్న సైజు బీచ్ కాగలదు. ఇప్పటికే చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుంచి శెలవుల్లో వేసవిలో ఎక్కువగా సందర్శిస్తున్న ఈ బీచ్, ఒడరేవు తరువాత జిల్లాలో రెండో స్థానాన్ని ఆక్రమించింది. జాతీయ రహదారిపైన నోటీసు బోర్డు, అక్కణ్ణుంచి రవాణా సౌకర్యాలను కల్పిస్తే పర్యాటకులకు ఉల్లాసంతో పాటు స్థానికులకు మంచి ఆదాయ వనరుల నందిస్తుందనటంలో సందేహం లేదు.

మైపాడు బీచ్: నెల్లూరు జిల్లాలో పేరుమోసిన ఈ బీచ్ నెల్లూరుకు 21 కి.మీ. దూరంలో ఉంది జాతీయ రహదారి నుంచి బీచికి రావటానికి వీలున్నందున కొన్ని సౌకర్యాలు కల్పిస్తే మిగతా జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులను కూడా ఆకర్షించే వీలుంది. 2 కి. మీ.ల పొడవాటి అందమైన బీచ్, లోతులేని సముద్రతీరం, ఆరేసిన పచ్చని అటూ ఇటూ ఉన్న సరుగుడు తోటలూ, ప్రశాంత వాతవరణం ఉన్న మైపాడును ఒక పగటిపూట విశ్రాంతి కేంద్రంగా అభివృద్ధి చేయొచ్చు. పార్కింగ్, స్నానాలకు గదులు, మంచినీటి సౌకర్యం, టాయ్లెట్లూ, రెస్టారెంట్లూ, రవాణా, వసతి సదుపాయాలు, షాపింగ్ ఏరియాలను కల్పించి అపార వనరులున్న ఈ బీచ్ని సుందరతరంగా తీర్చిదిద్దితే మరింత మంది పర్యాటకులను ఆకర్షించే వీలుంది.

నోడూరు బీమ్: నెల్లూరుకు 26 కి.మీ.ల దూరంలో ఉన్న కోడూర్ బీచ్ సహజసిద్ధంగ పొడవుగా ఉన్నా, చుట్టూ ఉన్న రొయ్యల చెరువులు కొంత ఇబ్బందిని కలిగిస్తున్నాయి. స్థానికులు ఈ బీచ్ను ముత్యాలపాళెం బీచ్ అంటారు. ఇక్కడ గల వేలాంగణి మాత ఆలయం ఎంతో బాగుంటుంది. ఈ బీచికి 10 కి.మీ.ల దక్షిణంగా కాటేపల్లి బీచ్ ఉంది. ఇక్కడో శివాలయం కూడా ఉంది. అందమైన ఈ బీచవద్ద అనేక మంది సముద్ర స్నానాలు చేస్తుంటారు. సమగ్రమైన ప్రణాళికతో అభివృద్ధి చర్యలు తీసుకొంటే నెల్లూరు జిల్లాలో మరో బీచ్ అందుబాటులోకి వస్తుంది.

తూపిలిపాలెం బీచ్: నెల్లూరుకు 36 కి.మీ. దూరంలోగల గూడూరుకు 45 కి.మీ.ల దూరంలో నున్న తూపిలిపాలెం బీచ్కు చేరే రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఉన్న టూరిస్ట్ రెస్టావుస్ దీనావస్థలో ఉంది. మెరిసే ఇసుక, శుభ్రమైన నీళ్లు, పచ్చటి పచ్చికబయళ్ళున్న ఈ బీచ్ కూడా పర్యాటకుల కంటే ముందు వసతులు కోసం ఆరాటపడుతోంది. రాష్ట్రంలో బీచ్ టూరిజం ఊపందుకోవాలంటే ముందుగా మౌలిక సదుపాయాల కల్పన, విశిష్టతలను వివరించటానికి తగిన ప్రచారం, కేవలం జంటలకే కాక మొత్తం కుటుంబ సభ్యులు పాల్గొనేటట్లు ఇతర ఆకర్షణల ఏర్పాటు, ఒకటి రెండు రోజుల ఉల్లాసంగా గడపటానికి కాటేజీలు రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్సులను నిర్మిస్తే బీచ్లు భూతల స్వర్గాలౌతాయి. స్థానికులకు పాడిపశువులౌతాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# జీవమున్న పంటలు విస్తరింప చేయాలి

## విజయరామ్, డా. రవి వర్మ పిలుపు






**నవతరం-శ్రీకాకుళం**

పోషక విలువలు కలిగిన పాత విత్తనాలను వినియోగించి జీవం ఉన్న పంటలను విస్తరింపజేయాలని, ప్రకృతి వ్యవసాయ రైతులకు వారధిగా ఉండి వారి కావల్సిన విత్తనము, మార్కెటింగ్, తగిన ధర వచ్చేలా వారధి లా పని చేస్తామన్నారు సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ్ రామ్, ప్రముఖ ఆయుర్వేద సిద్ద వైద్యులు డా రవి వర్మ పిలుపునిచ్చారు. అరకు సమీపంలోని డుంబ్రిగూడ మండలంలో కిల్లో గూడ గ్రామంలో ప్రారంభమైన 17వ పాత విత్తనాల పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రసంగించారు. జీవ వైవిధ్యానికి అనువుగా ఆరోగ్య గుణాలు కలిగిన విత్తనాల ద్వారా పంటలను వేయాలన్నారు. సారవంతం కాని విత్తనాల వల్ల పంటలు వచ్చినప్పటికీ పక్షులు, పశువులు మనుగడ సాధించలేక పోతున్నాయన్నారు. దేశంలో 60 సంవత్సరాల క్రితం వచ్చిన హరిత విప్లవం ప్రభావం వలన భూసారం తగ్గి..నేడు పోషక విలువలు లేని పంట ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. దీంతో ఆరోగ్యానికి హాని కలిగి పలు వ్యాధుల బారిన పడే పరిస్థితి ప్రజలకు నెలకొంటుందన్నారు. ఈ నేపథ్యంలో పాత విత్తనాల పండుగ స్ఫూర్తితో జీవమున్న విత్తనాలతో పంటలను విస్తరింప చేయడానికి రైతులు చొరవ చూపాలన్నారు. ఆరోగ్యకర పంటల సంస్కృతిని కొనసాగించేందుకు జూన్ 5న కృష్ణాజిల్లాలో పాత విత్తనాల పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాయలసీమలో కూడా ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టే ఆలోచన ఉందన్నారు. డా. రవి వర్మ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనుగడను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జీవమున్న విత్తనాలతో పంటలు వేయడానికి ముందుకు రావాలన్నారు. వెయ్యి ఏళ్ళు బతకడం అంటే భవిష్యత్ తరాలకు మంచి జరిగే సంస్కృతిని, విధానాలను కొనసాగించడం అన్నారు. ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్. వర్మ ప్రసంగిస్తూ దేశీయ వ్యవసాయానికి రసాయనాలు, క్రిమిసంహారక మందులు అవసరం లేదని, ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాచీన మూలాలు మరిస్తే నష్టం తప్పదని పేర్కొన్నారు. కరోనా ఎన్నో గుణపాఠాలు నేర్పడంతోపాటు ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను తెలియజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సభ కు పంచారి దేవుళ్ళు అధ్యక్షుత వహించారు. నాగరికత పెరిగి కొద్దీ ఇబ్బదులు పెరుగు తున్నాయి. డబ్బు ఉన్న ఉపయోగం లేదు. కరోనా నష్టం ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత పెరిగింది. జీవన ఉన్న దేశియా విత్తనాలు కాపాడుకొంటూ, విస్తృతంగా చిరు ధన్య పంటలకు పునుకోవాలి. ప్రాచీన మూలాలు మారిస్తే చాలా నష్టం.ఆచార్య రాజేందర్ ప్రసాద్, మన్మధరావు, సహో, పాత్రో, శ్రీనివాస, సర్పంచ్ సీతారాం, ఎంపీటీసీ దేవదాస్, జాకబ్, ఆనందరావు, సత్యనారాయణ, సంజీవిని ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకులుశ్రీమతి వరలక్ష్మి, కిల్లో రామచంద్ర, రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు. విత్తనాల పండుగలో పాల్గొన్న వారికి అతిథులు బహుమతులు ప్రధానం చేశారు.

# యమునా పుష్కరాల్లో రాజేంద్రుడి అనుభవం




### భక్తి నిజమా? అబద్ధమా? అసలు సత్యం ఏంటి?

2026 యమునా పుష్కరాల సందర్భంగా రాజేంద్రుడు ఉత్తర భారత యాత్రకు బయలుదేరాడు. చిన్నప్పటి నుంచి విన్న కథలు అతని మనసులో మోగుతున్నాయి. "పుష్కర స్నానం చేస్తే పాపాలు పోతాయి... అకాల మృత్యువు దూరమవుతుంది..." అనే మాటలు. ఈసారి నిజం తెలుసుకోవాలనే ఆసక్తితోనే వెళ్లాడు.

యమునా నది తీరం చేరుకున్నప్పుడు అతను ఒక విషయం గమనించాడు. వేలాది మంది భక్తులు విశ్వాసంతో స్నానం చేస్తున్నారు. కొందరి కళ్లలో భక్తి, మరికొందరిలో భయం. రాజేంద్రుడు కూడా నదిలోకి దిగే ముందు కాసేపు ఆలోచించాడు

"ఇది నిజంగా పాపాలను కడిగేస్తుందా? లేక మనసుకు ఓ ధైర్యం ఇస్తుందా?"

అతను శాంతంగా నీటిలో మునిగాడు. ఆ నీరు చల్లగా ఉంది... తల మునిగిన తర్వాత బయటకు వచ్చేసరికి అతని మనసు చాలా తేలికగా అనిపించింది. కానీ వెంటనే అతనికి అర్థమైంది ఇది శాస్త్రీయంగా పాపాలు పోయినట్టు కాదు, మనసు నమ్మకం వల్ల వచ్చిన ప్రశాంతత.

అక్కడే ఒక పండితుడు చెప్పిన మాట అతనికి గుర్తుంది:

"పుష్కరాలు అనేవి గురుగ్రహం సంచారం ఆధారంగా వస్తాయి. ఇది సంప్రదాయం. కానీ అద్భుత ఫలితాలు అన్నవి విశ్వాసం మాత్రమే."

కథలో ఏమి నిజం?

పుష్కరాలు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి వస్తాయి

యమునా నది ఉత్తరాఖండ్లో పుట్టి ప్రయాగరాజ్ వద్ద గంగలో కలుస్తుంది

నదిలో స్నానం శరీరానికి శుభ్రత, మనసుకు శాంతి ఇస్తుంది

ప్రకృతిని గౌరవించడం మన సంస్కృతిలో భాగం

కథలో ఏమి అబద్ధం / అతిశయోక్తి?

పుష్కర స్నానం చేస్తే పాపాలు పూర్తిగా పోతాయి

అకాల మృత్యువు ఖచ్చితంగా దూరమవుతుంది

గ్రహాల ప్రభావంతో నీరు ఔషధంగా మారుతుంది

స్నానం ముగిసిన తర్వాత రాజేంద్రుడు నదిని చూసి మెల్లగా నవ్వాడు.

"నదిలో మునిగితే జీవితం మారదు... కానీ మన ఆలోచన మారితే జీవితం మారుతుంది" అని అతను తనలో తాను అనుకున్నాడు.

ముగింపు:

పుష్కరాలు మనకు ఒక గొప్ప సత్యం చెబుతాయి భక్తి మనసుకు బలం ఇస్తుంది, కానీ నిజమైన పుణ్యం ప్రకృతిని కాపాడడంలోనే ఉంది.

"నదిని పూజించడం కాదు... నదిని పరిరక్షించడం అదే అసలు భక్తి!"

భక్తి కలం
తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా.
బాబు జగ్జీవన్ రామ్ నగర్,
హైదరాబాద్ - 500037

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**- కోవిడ్ అనాథలకు ప్రత్యేక సదస్సు**
**- సైబర్ మోసాలపై జాగ్రత్తలు**
**- బ్యాంకింగ్ సేవలు తెలుసుకోవాలి**

**నవతరం-శ్రీకాకుళం**

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రతి ఒక్కరికీ ఆర్థిక అంశాలపై కనీస అవగాహన ఉండాలని, ముఖ్యంగా బ్యాంకింగ్ సేవలు, పొదుపు పథకాలపై తెలుసుకుని సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని జిల్లా లీడ్ మేనేజర్ పి. శ్రీనివాసరావు సూచించారు. భారత ప్రభుత్వ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా శిశు సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. 'పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్' పథకం లబ్ధిదారులైన కోవిడ్ అనాథ పిల్లలకు శ్రీనివాసరావు బ్యాంకింగ్ సేవలు, ఫిక్స్డ్ డిపాజిట్ పథకాల ప్రయోజనాలు వివరించారు. డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ఎంత ముఖ్యమో తెలియజేశారు. హెడ్ పోస్టుమాస్టర్ రంగారావు తపాలా శాఖ పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి ఎస్. సువర్ణ మాట్లాడుతూ, ఆర్థిక క్రమశిక్షణతో పాటు మంచి ప్రవర్తనతో ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లలకు సూచించారు.




ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, డీసీపీఓ కె.వి. రమణ, బాలల రక్షణ అధికారులు, సిబ్బంది, పిల్లల సంరక్షకులు పాల్గొన్నారు.

# అత్యవసర వైద్యం అందించిన డా.ఇంజరపు మోహన్



- వైద్యమందించటం నా బాధ్యత
- డా. ఇంజరపు.మోహన్ రావు

**నవతరం-శ్రీకాకుళం**

ఎలాంటి పరిస్థితులలోనైనా వైద్యమందించటం నా బాధ్యత అని, అరసవల్లికి చెందిన డా.ఇంజరపు.మోహన్ రావు అన్నారు. స్థానిక పట్టణ నిరాశ్రయుల భవనంలో వృద్ధురాలకు సోమవారం రాత్రి ఇంజరపు వైద్యసేవలను అందించారు. ఉర్లం. శివతేజ పట్నాయక్ అందించిన సమాచారం మేరకు వృద్ధురాలకు, షెల్టర్ లో తలదాచుకుంటున్న చిన్నారులకు, వైద్యాన్నందించానని తెలిపారు. ఇక్కడ నివాసముంటున్న వారికి, ఏ అవసరమున్న శివతేజ అండగా ఉండటం గొప్పవిషయమని, వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, తగినన్ని నీళ్లను, వీలైతే కాచి వడపోసిన నీటిని, బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వృద్ధురాలకు తల తిరుగుతుందని సమాచారమివ్వటంతో, బిపి పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులను అందజేశానని తెలిపారు. ప్రతి నెలా ఒక ఆదివారం ఇక్కడ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఏ వేళలోనైనా అనాధులకు, అవసరమైన వారికి అత్యవసరం వైద్యసేవలు అందించటానికి సిద్ధమని ఈ సందర్భంగా తెలిపారు.
ఈ వైద్యసేవలో షెల్టర్ నివాసకులు, సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ పాల్గొన్నారు.

# నెల్లి సూర్యనారాయణ మృతికి సంతాపం

**నవతరం-శ్రీకాకుళం**



సిపిఐ సీనియర్ నేత నెల్లి సూర్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని మంగళవారం ఏపీఎన్జీవో డివిజన్ గౌరవ అధ్యక్షులు లిల్లీ పుష్ప నాదం డివిజన్అధ్యక్షులు పైలఈశ్వరరావు వెలగవాడ గ్రామంలో ఆయన స్వగృహంకి వెళ్లి సంతాపం తెలియజేశారు సూర్యనారాయణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు అల్లుడు కూతురు అప్పలనాయుడు భారతి ను ఓదార్చారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలు అవసరం



ఐఎఫ్డబ్ల్యూజే డిమాండ్

**నవతరం-శ్రీకాకుళం**

చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (×ఖీఔజీ) ఆంధ్రప్రదేశ్ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై ఐఎఫ్డబ్ల్యూజే సెంటర్ కమిటీ సభ్యులు పేడాడ పరమేశ్వరరావు, రాష్ట్ర యూనియన్ ఇంచార్జ్ ఎన్. ఈశ్వరరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిజం రాసినందుకే జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తే ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదమని ఐఎఫ్డబ్ల్యూజే నేతలు హెచ్చరించారు. జర్నలిజం ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని, అది దెబ్బతింటే వ్యవస్థ మొత్తం కుదేలవుతుందని పేర్కొన్నారు.
ఈ ఘటనపై ఐఎఫ్డబ్ల్యూజే ఉత్తరాంధ్ర ప్రతినిధి ఎంవి మల్లేశ్వరరావు, విశాఖపట్నం ఇంచార్జ్ కుంచి అప్పలనాయుడు, శ్రీకాకుళం నవ చైతన్య, జై వర్ధన్ సహా పలువురు నాయకులు ఖండన వ్యక్తం చేశారు. అలాగే జీవి నాగభూషణ్, చౌదరి సత్యనారాయణ, మల్లారెడ్డి కళ్యాణ చక్రవర్తి, కనకల రామారావు, సింగూరు బాబ్జి తదితరులు ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించారు.
జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ నిజాలను వెలికితీస్తున్న సమయంలో వారిపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని నేతలు పేర్కొన్నారు. వాకింగ్‌కు వెళ్లిన సమయంలో జగన్మోహన్ రెడ్డిని దుండగులు వెంటాడి కత్తులు, వేటకొడవళ్లతో హత్య చేయడం జర్నలిజంపై జరిగిన క్రూర దాడిగా వారు అభివర్ణించారు.
ఈ ఘటనలో పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని కోరారు.

# ప్రజాసేవ... దేశ సేవతో సమానం..

- అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం
- మాజీ సైనికుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**నవతరం-శ్రీకాకుళం**

ప్రజాసేవ ... దేశ సేవతో సమానమని, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం అన్నారు. స్థానిక కొత్త రోడ్ కూడలి వద్ద గల ఆర్మి కేంటీన్ ఆవరణలో, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని, చైర్మన్, విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పెద్ది.ఈశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ బృందం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం అధ్యక్షులు పూర్ణచంద్రరావు.కటకం, ఇతర కార్యవర్గ సభ్యులతో కలసి మజ్జిగ వితరణ అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, నియోజకవర్గ శాసనసభ్యులు, మునిసిపల్ కమీషనర్ హనుమంతు.కూర్మారావు పిలుపుమేరకు, ఆర్మి కాంటీన్ వద్ద, వేసవి ముగిసేవరకు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించామని, ప్రతి రోజు ఉదయం 9గంటల నుండి మధ్యాన్నం 2గంటల వరకు, మజ్జిగ సేవ కొనసాగుతుందన్నారు. అనంతరం ప్రజలకోసం రెండు కుండలతో నీళ్లను ఉంచుతామని, వేషవిలో ఈరోజు ఏర్పాటు చేసిన చలివేంద్రం బాటసారుల దాహర్తిని కొంతైనా తీరుస్తుందని, దీనికి అవకాశం ఇచ్చిన హెడ్ క్వార్టర్స్ తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా, లోకల్ ఆర్మీ క్యాంటీన్ మేనేజర్ బృందానికి ధన్యవాదాలన్నారు. అలాగే ఇక్కడ సేవ చెయ్యటానికి అవకాశం ఉన్నవారు మా చరవాణిని 9439456757 సంప్రదించాలన్నారు.
ఈ కార్యక్రమంలో క్యాంటీన్ మేనేజర్ పప్పల.గోవిందరావు, లయన్ పొన్నాడ రవి కుమార్, జనరల్ సెక్రటరీ పైడి మురళీధర రావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సనపల. రామకృష్ణ, కోశాధికారి ఎమ్.సింహాచలం, హానరరీ ప్రెసిడెంట్ ఎస్.ఎల్.రావు, బర్రి సంజీవ రావు, తర్రా కృష్ణా రావు, తమ్మినేని కృష్ణారావు,మహిళా సెక్రెటరీ పి. పద్మావతి అడ్వైజర్ పైడి . రామారావు, ఎక్జిక్యూటివ్ మెంబర్ లు బి.రాంబాబు, డి.వాసుదేవరావు, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్. నాగభూషణ రావు, సనపల రాములు, కూన.జగన్నాధం, జిల్లా నలుమూలల నుంచి మాజీ సైనికులు వీర నారీ మణులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఒకరు అరెస్ట్

- 3.135 కిలోల గంజాయి స్వాధీనం
- పలాస స్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు
- బారువ పోలీసుల కేసు నమోదు

**నవతరం-శ్రీకాకుళం**

బారువ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.
నిరంజన్ మాలిక్ (A-1) అనే వ్యక్తి లిథు నాయక్ (A-2) వద్ద నుంచి సుమారు 3.135 కిలోల గంజాయిని స్వీకరించి, దానిని సరోజ్ నాయక్ (ఏ-3) వద్దకు తరలించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని మూడు ప్యాకెట్లుగా బ్రౌన్ కలర్ ప్లాస్టర్‌తో చుట్టి, నలుపు-నీలం రంగుల బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకుని రైలు ద్వారా తరలించేందుకు బయలుదేరాడు.
ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్ వద్ద బారువ ఎస్సై ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా, అనుమానాస్పదంగా కనిపించిన నిరంజన్ మాలిక్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది.
నిందితుడి వద్ద నుంచి 3.135 కిలోల గంజాయి, ఒక మొబైల్ ఫోన్, రూ.100 నగదు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సోంపేట సీఐ మంగరాజు తెలిపారు.



# లాజిస్టిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

**నవతరం- విశాఖపట్నం**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




విశాఖపట్నంలోని వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ తాత్కాలిక భవనంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లతో కలసి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పలు పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుత స్థితి గురించి ఈ సమీక్షలో చర్చించారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఆలోచనలను ఈ సంధర్భంగా పంచుకున్నారు. ఉత్తరాంధ్ర లోని రైల్వే ప్రాజెక్టులను, తీరప్రాంత రవాణాను అనుసంధానం చేసుకుని లాజిస్టిక్ హబ్ గా మార్చే దిశగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పలు కీలక సూచనలను చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పెట్రోల్, డీజల్‌లకు కొరత లేదు

- పెట్రోల్, డీజిల్ లేదని అసత్య ప్రచారాలు చేయొద్దు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం-శ్రీకాకుళం**




జిల్లాలో పెట్రోల్, డీజిల్ లకు కొరత లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలో గల బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండియన్ ఆయిల్ బంక్, రైతు బజార్ పక్కన గల ఇండియన్ ఆయిల్ బంక్, డే అండ్ నైట్ దగ్గర గల హెచ్ పీ బంకులను ఆయన సందర్శించారు. ఆయిల్ అయిపోక ముందే ఇండెంటెడ్ పెట్టినందున వలన ఆయిల్ వెంటనే వచ్చిందని, బంకు యాజమానులను ఆయన అభినందించారు. నిన్న ఎంత ఆయిల్ వేయించారు.. ఈ రోజు ఎంత పెట్రోలు వేయించారో వాహన చోదకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 5 పెట్రోల్ బంకుల్లో ఆయిల్ లేకపోతే విశాఖపట్నం నుండి వెంటనే వచ్చిందన్నారు. అమ్ముకునే వారికి పెద్ద మొత్తంలో ఆయిల్ వేయవద్దని ఆదేశించారు. రైతు బజార్ వద్ద గల పెట్రోల్ బంకులో 8 వేల లీటర్లు అందుబాటులో ఉందన్నారు. ఆయిల్ ఉంటుండగానే పెట్రోల్ కంపెనీకి ఇండెంటెడ్ పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరుగుతున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ లో ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెట్రోల్ బంకులు వద్ద ఒక విఆర్ఓ, పోలీసు ఉంటారన్నారు. కొన్ని బంకులకు ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియమించినట్లు వివరించారు. పెట్రోల్, డీజిల్ లేదని ఎవరూ అసత్య ప్రచారం చేయొద్దన్నారు. మత్స్యకారులు, రైతులకు సంబంధించి సంబంధిత సచివాలయాల అసిస్టెంట్లు కూపన్లు జారీ చేస్తారని, వారు అందుబాటులో లేని యెడల బంకులు వద్ద ఉన్న విఆర్ఓ లు కూపన్లు జారీ చేస్తారన్నారు. విఆర్ఓ, సచివాలయాల సంబంధిత అసిస్టెంట్లు కో ఆర్డినేట్ చేసుకోవాలన్నారు. పెట్రోల్ డీజిల్ లకు ఏ విధమైన కొరత లేదన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియ, తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**